సాక్షి
వికారాబాద్
శుక్రవారం ¦ 2 ¦ జూన్ ¦ 2023



'దశాబ్ది'కి నిధులేవీ?

దశాబ్ది ఉత్సవాలకు నిధుల కొరత అడ్డంకిగా మారిందని పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 8లో▸



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

పెద్దేముల్ మండలం మారేపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన సంబరాలు ఘనంగా నిర్వహించారు. 9లో▸



అభివృద్ధి శూన్యం!

తెలంగాణ వచ్చి పదేళ్లవుతున్నా రాష్ట్రంలో అభివృద్ధి ఏమీ జరగలేదని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

అవతరణ వేడుకలకు సర్వం సిద్ధం

వికారాబాద్: రాష్ట్ర అవతరణ వేడుకలకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించే జెండావిష్కరణ కార్యక్రమానికి ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, అధికారులు జెండావిష్కరణ సంబరాల్లో పాల్గొంటారు.

బూర్గుపల్లిలో 'మీతో నేను'



కాలనీలోని బావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని బూర్గుపల్లిలో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ మీతో నేను కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పథకాలు దేశానికి దిక్సూచిగా నిలుస్తున్నాయని తెలిపారు. గ్రామాల్లో ఇంటింటికీ భగీరథ నీరు అందుతోందని స్పష్టంచేశారు. పట్టణ ప్రగతిలో చేయకుండా మిగిలిపోయిన పనులను పూర్తి చేస్తామన్నారు. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే చేరికలు



మహేశ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

పూడూరు: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గట్టుపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్, మైనార్టీ నాయకులు గురువారం ఆయన సమక్షంలో గులాబీ గూటికి చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న ఎంతోమంది బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ ప్రతినిధులు

అనంతగిరి: తెలంగాణ ఆల్ సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశాన్ని గురువారం వికారాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 2023- 26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాణిక్యప్రభు, ప్రధాన కార్యదర్శిగా జూకారెడ్డి, కోశాధికారిగా జీవన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా జొన్నల బస్వరాజు, వెంకటేశం, సహాయ కార్యదర్శిగా ప్రభులింగం, మల్లయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గోపాల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా శ్రీనివాస్, నారాయణరెడ్డి, చంద్రయ్య, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. వెంకటయ్యగౌడ్, వీరేశం ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

కలెక్టర్‌తో జలశక్తి అభియాన్ కేంద్ర బృందం భేటీ



ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్ర జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు అంకిత్ మిశ్రా, డిప్యూటీ సెక్రటరీ అంకిత్ విశ్వకర్మ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరీశ్‌తో భేటీ అయ్యారు. జలశక్తి అభియాన్ ద్వారా జిల్లాలో చేపట్టిన పనుల గురించి చర్చించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.



అనంతగిరి: వికారాబాద్‌లోని ఆర్‌డీఓ కార్యాలయం

ప్రత్యేక ముస్తాబు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. కలెక్టరేట్‌తో పాలు ఆయా శాఖల భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆఫీసుల వద్ద జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ప్రారంభమయ్యే సంబరాలు 21రోజుల పాటు ఘనంగా కొనసాగనున్నాయి.



వికారాబాద్ అర్బన్: విద్యుత్ దీపాల వెలుగులో కలెక్టరేట్ భవనం

అక్రమ కట్టడాలు.. అడ్డగోలు వసూళ్లు!

పక్క ఫొటోలో కనిపిస్తున్న బహుళ అంతస్తు నిర్మాణం పరిగిలోని 5వ వార్డు అయ్యప్ప ఆలయానికి వెళ్లే దారిలో ఉంది. కేవలం ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకున్న యజమాని.. అక్రమంగా సెల్లార్‌తో పాటు బహుళ అంతస్తులు నిర్మిస్తున్నాడు. ఈ అక్రమ కట్టడానికి మున్సిపల్ అధికారులు పెద్దమొత్తంలో డబ్బు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. ఈ నిర్మాణాన్ని ఆపేయాలని డిమాండ్ చేస్తూ పలు ప్రజాసంఘాల నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టాయి. దీంతో కొద్ది రోజులు పనులు ఆపేసిన అధికారులు ఆ తర్వాత యథావిధిగా సాగుతున్నా పట్టించుకోవడం లేదు.

- పరిగిలో ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణం
- గ్రౌండ్ ఫ్లోర్‌కు అనుమతి తీసుకుని ఐదంతస్తులు వేస్తున్న వైనం
- పర్మిషన్ లేకుండానే సెల్లార్ల తవ్వకం
- నాలాలు, రోడ్లను ఆక్రమిస్తూ వెలుస్తున్న భవంతులు
- మామూళ్ల మత్తులో అధికారులు



కొడంగల్- పరిగి రూట్‌లో అక్రమంగా నిర్మించిన సెల్లార్

పరిగి: మున్సిపల్ పరిధి మాదిరిగానే పట్టణంలో అక్రమ కట్టడాలు సైతం ఊపందుకున్నాయి. ఏకంగా రోడ్లు, నాలాలను ఆక్రమించడంతో పాటు ఎలాంటి అనుమతులు లేకుండా భారీ భవంతులు నిర్మిస్తున్నారు. కేవలం ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకుని అంతస్తులపై అంతస్తులు వేస్తున్నారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోడం లేదనే ఆరోపణలున్నాయి. శాశ్వత కట్టడాలకు పిల్లర్ల చొప్పున రేటు కట్టి వసూలు చేస్తున్నారు. దీంతో సొంతింటి కలను నిర్మించుకోవాలనుకుంటున్న పేద, మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఎవరైనా సరే అధికారులు చెప్పినంత ఇస్తేనే సరి.. లేదంటే నిత్యం తమ సిబ్బందిని పంపించి పనులకు ఆటంకం కలిగిస్తున్నారని నిర్మాణదారులు చెబుతున్నారు. ఈ వ్యవహారమంతా కొంతమంది అధికారులు, పాలక వర్గానికి సంబంధం లేని ఓ నాయకుడి కనుసన్నల్లో సాగుతోందనే ఆరోపణలున్నాయి.

నిర్మాణాన్ని బట్టి వసూళ్లు

పరిగి మున్సిపల్‌లో 15 వార్డులు ఉన్నాయి. వీటిలో మూడు వార్డులు మినహా మిగతా వార్డుల్లో ఇళ్ల, ఇతర నిర్మాణాలు వేగం పుంజుకున్నాయి. ఆయా వార్డుల్లో జరుగుతున్న నిర్మాణ పనులు అవినీతి అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. మున్సిపాలిటీలో ఏయే ప్రాంతాల్లో నిర్మాణాలు జరుగుతున్నాయో తెలుసుకునేందుకు ఒకరిద్దరు సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. వీరు పట్టణమంతా తిరిగి కట్టడాల వివరాలు తీసుకొస్తారు. ఆతర్వాత మున్సిపల్ అధికారులు తమ సిబ్బందిని పంపించి రాయబారం నెరుపుతారు. డీల్ కుదిరితే సరి.. లేదంటే పనులు ఆపించేస్తారు. ఇలా ఒక్కో ఇంటికి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వసూలు వసూలు చేస్తున్నారనే చర్చ సాగుతోంది.

నిబంధనలకు విరుద్ధంగా

పట్టణంలో ఇళ్లు నిర్మించుకునే వారు మున్సిపాలిటీలో ఒక ఫ్లోర్‌కు అనుమతులు తీసుకుని, అదనంగా మరో ఫ్లోర్ వేస్తున్నారు. జీ ప్లస్ 2 పర్మిషన్ తీసుకున్న వారు జీప్లస్ 3, 4, 5 వరకు వెళ్తున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు నిర్మాణాల వద్దకు వెళ్లి తమకు కావాల్సింది చెప్పి వెళ్తున్నారు.

ఇవి పాటించాలి

- సెట్ బ్యాక్ స్థలంలో శ్లాబులు, ప్రహరీ, సెప్టిక్ ట్యాంకులు ఉండకూడదు. 100గజాల లోపు అయితే రోడ్డుకు 5 ఫీట్లు, రెండు వైపుల 2ఫీట్ల చొప్పున స్థలం వదలాలి.
- 200 గజాల స్థలంలో అయితే రోడ్డు వైపు 5ఫీట్లు, మిగిలిన వైపుల 5 ఫీట్లు వెనక్కి జరిగి శ్లాబులు వేసుకోవాలి. తలుపులు, గేట్లు ఇంటి లోపలికి తెరుచుకోవాలి.
- భవన నిర్మాణం దరఖాస్తు సమయంలో 246 గజాల స్థలం దాటిన ఇంటికి 10శాతం మార్టిగేజ్ వర్తిస్తుంది. జీప్లస్ అయితే తప్పనిసరిగా మార్టిగేజ్ చేయించాలి.
- పైఅనుమతుల కోసం టీఎస్‌బీపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మున్సిపాలిటీలో 75 చదరపు గజాల నుంచి 200 చదరపు గజాల వరకు జీప్లస్ 1 నివాసాలకు వెంటనే పర్మిషన్ వస్తుంది. ఆపై ఉన్న స్థలంలో సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి, అనుమతులు మంజూరు చేస్తారు.

నిర్మిస్తే చర్యలు



మున్సిపల్‌లో జీప్లస్ 2 వరకే అనుమతులు ఉన్నాయి. అంతకన్నా ఎక్కువ అంతస్తులు నిర్మించాలంటే 500 చదరపు గజాల స్థలం ఉండాలి. అది కూడా డీటీసీపీ నుంచి పర్మిషన్ తీసుకోవాలి. ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్లు, బహుళ అంతస్తులు నిర్మిస్తే టాస్క్‌ఫోర్స్ వాళ్లకు సమాచారం అందించి చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసన్, మున్సిపల్ కమిషనర్, పరిగి

రైతుకు పెద్దపీట

- సాగు బలోపేతంపై సీఎం ప్రత్యేక దృష్టి
- వ్యవసాయానికి దేశంలో ఎక్కడా లేని పథకాలు
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి
- రాఘవపూర్‌లో పీఏసీఎస్ గోదాం ప్రారంభం



గోదాంను ప్రారంభిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: సీఎం కేసీఆర్ రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాఘవపూర్‌లో నిర్మించిన గోదాంను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. గతంలో రైతుల కోసం ఇంతగా ఆలోచించిన ప్రభుత్వం ఏదీ లేదన్నారు. అడగకపోయినా వీరి సౌకర్యార్థం గోదాంలు నిర్మించడం గొప్ప విషయమని తెలిపారు. వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంటకు సరైన ధర దక్కని సమయంలో ఇక్కడ నిల్వ చేసుకుని, ధర పెరిగిన తర్వాత అమ్ముకునే వీలుంటుందన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇక్కడ నిల్వ చేసేందుకు వెసులుబాటు కలిగిందని స్పష్టంచేశారు. రైతుల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని అనేక పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా, నిరంతర ఉచిత విద్యుత్ పథకాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని వివరించారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ రైతుల కోసం ఇన్ని పథకాలు అమలు కావడం లేదని తెలిపారు. సీఎం కేసీఆర్ స్వయంగా రైతు కాబట్టి రైతుల సమస్యలన్నీ ఆయనకు స్పష్టంగా తెలుసని చెప్పారు. రైతు బీమా ద్వారా బాధిత కుటుంబాలు రోడ్డున పడకుండా చూశారన్నారు.

మొదటి వరుసలో తెలంగాణ

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అమలులో తెలంగాణ రాష్ట్రం మొదటి వరుసలో ఉందని తెలిపారు. గోదాం నిర్మాణం ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సర్పంచ్ జగన్, పీఏసీఎస్ డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆస్తులపై బీఆర్‌ఎస్ కన్ను

బీజేపీ నేతల ఆరోపణ



ఆలయ ఆవరణలోని పాఠశాలకు వేసిన గులాబీ రంగును చూపిస్తున్న నాయకులు

తాండూరు టౌన్: పోట్లి మహరాజ్ ఆలయ ఆస్తులపై కన్నేసిన బీఆర్‌ఎస్ నాయకుల ఆగడాలను అడ్డుకుంటామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. పార్టీ నాయకులతో కలిసి గురువారం ఆలయ ఆస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ ఆవరణలోని ప్రైవేటు పాఠశాల చాలా ఏళ్లుగా లీజుపై కొనసాగుతోందని తెలిపారు. దీనిపై కన్నేసిన బీఆర్‌ఎస్ నాయకులు, పాలక మండలి సభ్యులు కలిసి ఎలాగైనా పాఠశాలను ఖాళీ చేయించి పాగా వేసేందుకు చూస్తున్నారని స్పష్టంచేశారు. ఇందులో భాగంగానే స్కూల్ తరగతి గోడలకు గులాబీ రంగు వేశారని మండిపడ్డారు. కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని ఆక్రమించి ఇక్కడ షాపింగ్ మాల్ నిర్మించాలనే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. గతంలో డాగ్‌బంగ్లా ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 135లోని ప్రభుత్వ స్థలాన్ని బీఆర్‌ఎస్ నాయకులు కబ్జా చేయగా, బీజేపీ ఆందోళనలు చేపట్టడంతో అధికారులు సదరు భూమిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఆలయ ఆస్తుల జోలికి వస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ విషయమై ఎమ్మెల్యే స్పందించి, కబ్జాను ఆపాలని కోరారు.

కరెంటు తీగలకు కాడెడ్లు బలి



మృతిచెందిన ఎద్దులు

- వేలాడే వైర్లు తగిలి పొలంలోనే కుప్పకూలిన ఆరు మూగజీవాలు

ఆమనగల్లు: వేలాడే విద్యుత్ తీగలు ఆరు ఎద్దులను బలితీసుకున్నాయి. ఈ హృదయవిదారక ఘటన మాడ్గుల మండలం నల్లచెరువు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఇటీవల పెద్ద ఎత్తున ఈదురుగాలులు వీచడంతో పొలాల్లోని విద్యుత్ తీగలు కిందకు వచ్చాయి. గురువారం ఉదయం పలువురి రైతులకు చెందిన ఎద్దులు అటువైపు వెళుతుండగా విద్యుత్ వైర్లు తాకడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. గ్రామానికి చెందిన కట్ట అంజయ్యకు చెందిన రెండు ఎద్దులు, పోచయ్యకు చెందిన రెండు ఎద్దులు, సాంబయ్యకు చెందిన ఎద్దు, యాదయ్యకు చెందిన ఓ ఎద్దు మృతిచెందాయి. ఎద్దులు మృతిచెందడంతో రైతులు బోరున విలపించారు. ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని రైతులు కోరారు. సంఘటనాస్థలాన్ని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించి రైతులను పరామర్శించారు. వ్యక్తిగతంగా రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బాధిత రైతులకు ఎద్దుకు రూ.5 వేలు చొప్పున 30 వేలు ఆర్థికసాయం అందించారు.

ఆలయ ప్రవేశంపై ఘర్షణ

- ఇరువర్గాల బాహాబాహీ
- పరస్పరం రాళ్లు రువ్వుకున్న ఆందోళనకారులు
- పోలీసు వాహనం అద్దాలు ధ్వంసం
- బ్రాహ్మణపల్లిలో ఘటన



ధ్వంసమైన పోలీసు వాహనం



పోలీసుల ఎదుటే గ్రామస్తుల వాగ్వాదం

దోమ: ఆలయ ప్రవేశం విషయంలో దళిత సామాజికవర్గానికి, గ్రామస్తులకు మధ్య జరిగిన ఘర్షణ ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘటనలో ఇరువర్గాల వారు రాళ్లు రువ్వుకోగా.. పక్కనే ఉన్న పోలీసు వాహనం ధ్వంసమైంది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఎస్‌ఐ విశ్వజాన్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, కుల, మత తారతమ్యాలు పాటించకూడదని తెలిపారు. అన్ని వర్గాల వారు కలిసిమెలిసి ఉండాలని సూచించారు. అందరికీ ఆలయ ప్రవేశం కల్పించాలన్నారు. ఈ నేపథ్యంలో గురువారం కొంతమంది దళితులు గ్రామంలోని గుడిలోకి వెళ్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న సర్పంచ్ జగని వెంకటయ్య సర్ది చెప్పే ప్రయత్నం చేసినా పరిస్థితి చక్కబడలేదు. పలువురు దళితులు పోలీస్ స్టేషన్ వెళ్లి విషయం చెప్పడంతో.. డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి ఎస్‌ఐ గ్రామానికి చేరుకున్నారు. ఇరువర్గాలను సముదాయించి సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వివరాలు ఆరా తీశారు. గుడి ప్రవేశం విషయంలోనే ఇరువర్గాలకు గొడవలు జరిగాయని గ్రామస్తులు వారి దృష్టికి తీసుకురాగా, కోపోద్రిక్తులైన ఇరువర్గాల వారు పోలీసుల ముందే రాళ్లు విసురుకుంటూ ఘర్షణకు పాల్పడ్డారు. ఈ ఘటనలో పక్కనే ఉన్న పోలీసు వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. విషయం తెలుసుకున్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ వెంకటరామయ్య పోలీసు సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాల ప్రజలను చెదరగొట్టి గొడవ సద్దుమనిగేలా చేశారు. ఇదిలా ఉండగా ఎస్‌ఐ విశ్వజాన్ ఒకే వర్గానికి కొమ్ముకాయడంతోనే ఘర్షణ వాతావరణం నెలకొందని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఎస్‌ఐ స్పందించలేదు.



పనులకు శంకుస్థాపన హోంమంత్రి, ఎమ్మెల్యే

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాలు అభివృద్ధి

నందిగామ: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాయని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. మండల పరిధిలోని మామిడిపల్లిలో హోంమంత్రి నిధులు రూ.1.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు చేయలేని అనేక అభివృద్ధి కార్యక్రమాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు.

క్లుప్తంగా

డాక్టర్ వీరయ్యకు పారిస్ ఆహ్వానం



వికారాబాద్ అర్బన్: అనంతపద్మనాభ డిగ్రీ, పీజీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ టి. వీరయ్యకు అరుదైన ఆహ్వానం అందింది. జూలై 2, 3 తేదీల్లో పారిస్ లో జరుగనున్న అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనే అవకాశం దక్కినట్లు ఆయన తెలిపారు. నానో టెక్నాలజీ భవిష్యత్తు అనే అంశంపై పారిస్‌లో జరుగనున్న సదస్సులో డాక్టర్ వీరయ్య స్పీకర్‌గా వ్యవహరించనున్నారు. భారతదేశంలో ఎంపిక చేసిన ఇద్దరిలో జిల్లా కేంద్రానికి చెందిన వీరయ్య ఒకరు కావడం విశేషం. గతంలో జరిగిన పలు అంతర్జాతీయ సదస్సుల్లో ఆయన మన దేశం తరఫున ప్రాతినిధ్యం వహించారు. రసాయన శాస్త్రంలో అపార అనుభవం ఉన్న డాక్టర్ వీరయ్య పలు పరిశోధనలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ టి. వీరయ్య మాట్లాడుతూ కొంతకాలంగా వైజ్ఞానిక అంశాలపై తాను పరిశోధన జరిపి ప్రభుత్వానికి అందజేసినట్లు తలిపారు. పారిస్ ఆహ్వానం తన పరిశోధన బాధ్యతలను మరింత పెంచినట్లు తెలిపారు.

ఆస్పత్రిలో రాడ్ లేదని ఆపరేషన్ చేయలేదు



అడివమ్మ

అనంతగిరి: ఓ మహిళకు చేయి విరగడంతో రాడ్ వేస్తామని ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి కొద్ది సేపటి అనంతరం అందులో వేసే రాడ్ లేదు అని చెప్పి సంబంధిత ఆస్పత్రి వైద్యులు చెప్పడంతో సదరు రోగి కుటుంబీకులు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. ఈ ఘటన వికారాబాద్ పట్టణంలోని మహావీర్ జనరల్ ఆస్పత్రిలో గురువారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నవాబ్‌పేట మండలం అక్నాపూర్‌కు చెందిన అడివమ్మ గత నెల 23న ప్రమాదంలో చేయి విరిగింది. దీంతో ఆమె 24న వికారాబాద్‌లోని మహావీర్ ఆస్పత్రిలో చేర్పించారు. 29న ఆపరేషన్ చేస్తామని చెప్పి థియేటర్‌లోకి తీసుకెళ్లిన అనంతరం బీపీ ఎక్కువైందని బయటకు తీసుకువచ్చారు. మరోసారి గురువారం ఆపరేషన్ కోసం థియేటర్‌లోకి తీసుకెళ్లారు. అక్కడ రోగికి మత్తు మందు ఇచ్చారు. అయినా ఆపరేషన్ చేయలేదు. ఎందుకు చేయడం లేదని కుటుంబీకులు అడిగితే మా వద్ద రాడ్ లేదు, ఇక్విప్‌మెంట్స్ లేవు అని చెబుతూ పేషెంట్‌ను ఆపరేషన్ థియేటర్ వెలుపలికి పంపించారు. కాగా ఈ విషయంపై ఆస్పత్రిపై తగిన చర్యలు తీసుకోవాలని, మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని కుటుంబీకులు కోరుతున్నారు.

కారు ఢీకొని గ్రామ కార్యదర్శికి తీవ్ర గాయాలు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ధారూరు: కారు ఢీకొన్న ఘటనలో గ్రామ కార్యదర్శి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. విధి నిర్వహణలో భాగంగా పంచాయతీ కార్యదర్శి అంజానాయక్ బైక్‌పై గురువారం డబుల్‌బెడ్రూమ్ ఇళ్లవైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అంజానాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిమ్నాస్టిక్స్‌లో సత్తా చాటిన కీర్తిఆనంద్

హుడాకాంప్లెక్స్: సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన జిమ్నాస్టిక్స్ టేబుల్ వాల్ట్, అనివెన్ బార్ మహిళా విభాగంలో కీర్తి ఆనంద్ ద్వితీయ స్థానం కైవసం చేసుకొని రెండు సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. సరూర్‌నగర్ హుడాకాంప్లెక్స్ చెందిన కీర్తి ఆనంద్ మెడల్స్‌తో పాటు రూ.30 వేల నగదును అందుకున్నారు. అనంతరం కోచ్ స్వర్ణలత, కళాశాల సిబ్బంది కీర్తి ఆనంద్‌ను అభినందించారు. ప్రభుత్వం ప్రోత్సాహంతోనే క్రీడల్లో రాణిస్తున్నానని, భవిష్యత్తులో దేశానికి ప్రాతినిధ్యం వహించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తానని కీర్తి ఆనంద్ ఆశాభావం వ్యక్తం చేశారు.



కీర్తి ఆనంద్‌ను సత్కరిస్తున్న కోచ్ స్వర్ణలత

'దశాబ్ది'కి నిధులేవీ?

'ప్రగతి' చాటేదెలా.. ఉత్సవాలు జరిగేదెలా?
- అందని నిధులు.. అయోమయంలో అధికారులు

కుల్కచర్ల: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలకు నిధుల కొరత అడ్డంకిగా మారింది. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళుతోంది. సర్పంచులు ఉత్సవాల నిర్వహణపై ఆసక్తి చూపకపోవడంతో ప్రత్యేకాధికారులను నియమించి అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 2 నుంచి 22 వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించడంతో పాటు పర్యవేక్షణకు మండల అధికారులకు బాధ్యతలను అప్పగించారు.

అందని నిధులు

దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు నిధులు కేటాయించినట్లు జిల్లా అధికారులు పేర్కొంటున్నా క్షేత్రస్థాయిలో పనిచేసే ఎంపీడీఓ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తమకు ఎటువంటి నిధులు రాలేదని చెబుతున్నారు. కార్యక్రమాల ఏర్పాటుకు అవసరమైన ఆర్థికభారాన్ని గ్రామపంచాయతీలు మోయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉత్సవాల నేపథ్యంలో గ్రామపంచాయతీ భవనాల అలంకరణ, ప్రభుత్వ కార్యాలయాల విద్యుద్దీకరణ వంటి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. అంతేకాక ఆయా శాఖలు నిర్వహించాల్సిన కార్యక్రమాలకు అవసరమైన నిధుల విషయంలో ఎటువంటి క్లారిటీ లేకపోవడంతో సందిగ్ధత నెలకొంది. ఉత్సవాలలో ప్రధానంగా 3వ తేదీ, 5న, 8న సుమారు వెయ్యిమంది నుంచి 1500మందితో సభలు, సహపంక్తి భోజనాలు ఏర్పాటుచేయాల్సిన కార్యక్రమాలు ఉన్నాయి. వీటి నిర్వహణను నేతలు తీసుకుంటుండటంతో నిధులు గ్రామపంచాయతీలకు అందే పరిస్థితి కనిపించడం లేదు.

అదనపు పని భారం

ఆయా శాఖల అధికారులకు తమరోజువారి కార్యక్రమాలతో పాటుగా దశాబ్ది ఉత్సవాల నిర్వహణ అదనపు పనిభారం కానుంది. 21రోజుల పాటుగా జరిగే ఈ ఉత్సవాలలో అన్ని శాఖలకూ ప్రాతినిధ్యం కల్పించారు. విధులు నిర్వహణ, ఆర్థికపరమైన కార్యక్రమాలు, జనసమీకరణకు ప్రజాప్రతినిధులతో సమీక్ష వంటి పనులకు ఇబ్బందిగా మారింది. ఒక్క రోజు నిర్వహించే వేడుకను తమ రాజకీయ ప్రయోజనాల కోసం 21రోజుల పాటుగా నిర్వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

'పైసలు ఇస్తేనే ఉత్సవాలు నిర్వహిస్తాం'

ధారూరు: పంచాయతీలకు నయాపైస ఇయ్యకుండా దశాబ్ది ఉత్సవాలు ఘనంగా చేయాలంటే ఎలా? అని మండలం రాంపూర్‌తండా గిరిజన సర్పంచ్ పాండునాయక్ గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. శుక్రవారం నుంచి మూడు వారాల పాటు వివిధ కార్యక్రమాలు చేయాలని ఆదేశిస్తే.. వాటి నిర్వహణకు డబ్బులు ఎక్కడ నుంచి తీసుకురావాలన్నారు. అభివృద్ధి పనుల కోసం వడ్డీలకు డబ్బులు తీసుకువచ్చి పనులు పూర్తి చేసినా.. ఇంతవరకు నిధుల జాడ లేదని మండిపడ్డారు. జీపీల పెండింగ్ నిధులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. ఇప్పటి వరకు ఖాతాల్లో వేయలేదని వాపోయారు. పైసలు ఇస్తేనే ఉత్సవాలు నిర్వహిస్తామని సర్పంచ్ ప్రకటించారు.

అప్పు చేయాల్సిన దుస్థితి



మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఆవిర్భవించినా నేడు అప్పులు చేసి కార్యక్రమాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అభివృద్ధి పనులకు పూర్తి స్థాయిలో విడుదల చేయకుండా అదనపు ఆర్థిక భారాన్ని మోపడం సరైంది కాదు. గ్రామపంచాయతీలకు అధికంగా నిధులు కేటాయించి ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తే బాగుండేది.

– లక్ష్మిఆనంద్, సర్పంచ్, మూజాహిద్‌పూర్

రాజకీయ ప్రయోజనాలే..



రాజకీయ ప్రయోజనాల కోసమే వేడుకలను 21 రోజులు నిర్వహిస్తున్నారు. నిధులు విడుదల చేయకుండానే కార్యక్రమాలను ఏర్పాటు చేయాలనడం ఆర్థిక భారాన్ని మోపడమే. పార్టీ కార్యక్రమాల మాదిరి ఉత్సవాలను నిర్వహిస్తున్నారే కానీ ప్రత్యేక కార్యక్రమాల ఏర్పాటు, నిధులు కేటాయించకపోవడం ఇబ్బందికరం.

– శిరీషాలక్ష్మారెడ్డి, బండవెల్కిచర్ల, సర్పంచ్.

నిధులు రావాల్సి ఉంది

దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు ప్రస్తుతానికి గ్రామ పంచాయతీలకు ఎటువంటి నిధులు రాలేదు. రావాల్సి ఉంది. త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. ఉత్సవాల విజయవంతానికి అందరితో కలిసికట్టుగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం.

– నాగవేణి, ఎంపీడీఓ, కుల్కచర్ల.

4న అవగాహన సదస్సు

కొడంగల్ : పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 4న విద్య అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ, ఉద్యమకారులకు సన్మాన సభ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ చేతుల మీదుగా సన్మానం ఉంటుందన్నారు. ఉస్మానియా, పాలమూరు యూనివర్సిటీల ప్రొఫెసర్లు 'అక్షరం ఆరోగ్యం ఆర్థికం' అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గడ్డి ట్రాక్టర్ అదుపుతప్పి ఇద్దరు దుర్మరణం

కేశంపేట: గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పిన ఘటనలో ఇద్దరు కూలీలు దుర్మరణం చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొందుర్గు మండలం తంగెళ్లపల్లికి చెందిన చెక్కల రాంచంద్రయ్య (45), చెక్కల దశరథం, వెంకిర్యాల గ్రామానికి చెందిన సున్నాల నర్సింహులు (50) కలిసి వెంకిర్యాల గ్రామంలోనే ట్రాక్టర్‌లో గడ్డిని లోడ్ చేసేందుకు కూలీ పనులకు వెళ్లారు. వెంకిర్యాలలో గడ్డిని లోడ్ చేసుకుని కడ్తాల్ మండలంలోని మక్తామాధారం వద్ద అన్‌లోడ్ చేసేందుకు వెళ్తుండగా అల్వాల గ్రామ శివారులో అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంతో ట్రాక్టర్ ఇంజన్ పైన కూర్చున్న కూలీలు కిందపడటంతో ట్రాక్టర్ టైర్లు చెక్కల రాంచంద్రయ్య, సున్నాల నర్సింహులు పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. చెక్కల దశరథానికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న చెక్కల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టాభూమికి పొజిషన్ చూపండి



మాట్లాడుతున్న కేఏఎన్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రవర్తి

షాద్‌నగర్‌రూరల్: పట్టా భూమికి పొజిషన్ చూపాలని వృద్ధురాలు వెంకటమ్మ ఏళ్లుగా ఎదురు చూస్తోందని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రవర్తి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చక్రవర్తి విలేకరులతో మాట్లాడారు. కేశంపేట మండలం కాకునూరు గ్రామానికి చెందిన దళిత వృద్ధురాలు ఎర్ర వెంకటమ్మకు గ్రామశివారులోని సర్వే నంబర్ 361/ఇ లో 20 గుంటల భూమి ఉందని అన్నారు. భూమి ధరణి పోర్టల్ రికార్డులో ఉందని, పట్టా పాసు పుస్తకం ఉందని, ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు అందుతుందని అన్నారు. గతంలో చేపట్టిన ఏడీ సర్వే రిపోర్టులో పట్టా భూమి ఉన్నట్లు నిర్ధారించారని అన్నారు. వృద్ధురాలు 12 ఏళ్లుగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా నేటి వరకు పొజిషన్ మాత్రం చూపలేదని అన్నారు. వెంకటమ్మకు న్యాయం చేస్తామని తహసీల్దారు చెప్పినా నేటికీ నెరవేర్చడంలేదన్నారు. వృద్ధురాలికి మద్దతుగా పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఎర్రవెంకటమ్మ భూ సమస్యను పాలకుల దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ నెల 7న కాకునూరు నుంచి షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్రను చేపడతామన్నారు. ఈ సమావేశంలో కేఏఎన్‌పీఎస్ నాయకులు గోవింద్, మోహన్‌కృష్ణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 369 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి సాంబశివరావు, ట్రాఫిక్ ఏసీపీ శంకరయ్య



హాజరైన కక్షిదారులు

- ట్రాఫిక్ రూల్స్ పాటిస్తేనే ప్రమాదాల నివారణ
- రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు

చేవెళ్ల: లోక్‌అదాలత్‌లో డ్రంకన్‌డ్రైవ్ కింద 369 కేసులు పరిష్కారమయ్యాయి. మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో గురువారం మూడు పోలీస్‌స్టేషన్లకు సంబంధించి నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ కేసుల పరిష్కారం కోసం మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ లోక్‌అదాలత్‌ను రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావుతోపాటు రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ శంకరయ్య పాల్గొన్ని ప్రారంభించారు. ఈ లోక్‌అదాలత్ ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని, మరోసారి ఇలాంటి కేసులు కాకుండా చూసుకోవాలని కక్షిదారులను ఆదేశించారు. మొదటి రోజు లోక్ అదాలత్‌లో 369 డ్రంకన్ డ్రైవ్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. చేవెళ్ల డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన ఈ లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సీఐ ఎస్. వాసు, ట్రాఫిక్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్‌ఐ చందర్‌నాయక్, న్యాయవాది కె. మహేందర్‌గౌడ్, సివిల్ పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధం

తాండూరు రూరల్: ప్రమాదవశాత్తు నిప్పంటించుకుని వరిగడ్డి దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని అంతారంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అంతారం శివారులోని ఊర చెరువు కింద కొందరు రైతులు వరి పంటను సాగు చేశారు. వరికోతలు పూర్తి కావడంతో ధాన్యాన్ని ఇంటికి తరలించారు. ప్రస్తుతం వరిపొలంలో గడ్డి మాత్రమే ఉంది. ప్రమాదవ శాత్తు పొలంలో మంటలు చేలరేగాయి. మంటలు కాస్తా పక్కపొలంలోకి వ్యాపించాయి. ఇలా పదుల ఎకరాల్లో ఉన్న వరిగడ్డి మొత్తం దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు. దీంతో రైతులకు పశుగ్రాం కొరత ఏర్పడింది. గ్రామానికి చెందిన పెండ్యా స్వామిదాస్ పొలంలో వరిధాన్యాన్ని కూడా ఫైర్ సిబ్బంది కాపాడారు.

శ్రీనివాస్‌గౌడ్‌ను విమర్శిస్తే సహించం



వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గౌడ సంఘం నేతలు

- గౌడ సంఘం నేతలు
- కాంగ్రెస్ నేత శంకర్ దిష్టిబొమ్మ దహనం

షాద్‌నగర్ రూరల్: మంత్రి శ్రీనివాస్ గౌడ్‌పై కాంగ్రెస్ నేత వీర్లపల్లి శంకర్ లేని పోని ఆరోపణలు చేయడం సరికాదని, ఇకపై ఇలాంటి వాటిని సహించేది లేదని గౌడ సంఘం నేతలు హెచ్చరించారు. గురువారం పట్టణ ప్రధాన కూడలిలో వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాజకీయ విమర్శలు చేసుకుంటే మాకు ఎలాంటి ఇబ్బంది లేదని, గౌడ వృత్తిని, కులాన్ని దూషిస్తే ఊరుకునేది లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వీర్లపల్లికి ఓటుతో తగిన బుద్ధి చెపుతారని అన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకుంటే గౌడల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నేతలు శివరాములు గౌడ్, వెంకటేష్ గౌడ్, ఆశన్న గౌడ్, రజనీకాంత్ గౌడ్, వన్నాడ ప్రకాష్ గౌడ్, రాఘవేందర్ గౌడ్, రాములు గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్రీశైలం గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నర్సింలు గౌడ్, హరికృష్ణ గౌడ్, రవీందర్ గౌడ్, రంగయ్య గౌడ్, యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన

శంకర్‌పల్లి: మండల కేంద్రంలోని ఆలయంలో గురువారం అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేద పండితులు నరేంద్ర సరస్వతి, స్వామి జగద్గురు సచ్చిదానంద సరస్వతి స్వామి మార్గదర్శనంలో అయ్యప్ప స్వామి విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరిగాయి. అంతకుముందు గణపతి పూజ, హోమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చీకోటి ప్రవీణ్ పూజల్లో పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, నాయకులు

వృద్ధుడు అదృశ్యం



మల్లయ్య (ఫైల్)

పహాడీషరీఫ్: వృద్ధుడు అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన బి.మల్లయ్య (70) క్లౌ రశాలకు గురువారం ఉదయం వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయమై కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాలలో వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో మల్లయ్య కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకి తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో కానీ, 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

కేశంపేట: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మహేశ్వరం మండలం పోరండ్ల గ్రామానికి చెందిన నిర్మల, బాలరాజు దంపతులు వేములనర్వ గ్రామంలో బంధువుల ఇంటికి బొడ్రాయి పండుగకు వచ్చి తిరిగి సొంత గ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. జల్‌పల్లికి చెందిన మల్లేశ్ బైక్‌పై అల్వాల గ్రామంలోని బంధువుల ఇంటికి వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రులకు తరలించారు.

ఫార్మాలో గ్యాస్ లీక్

నిజాంపేట్: బాచుపల్లిలోని ఓ ఫార్మా యూనిట్-3 కంపెనీలో గురువారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో గ్యాస్ లీకై ఏడుగురు అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. దీంతో వారిని వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స కొనసాగించారు. ఫార్మా కంపెనీలో మిథెల్ డై క్లోరైడ్ గ్యాస్ లీక్ కావడంతో ఎన్.గౌరీనాథ్(44), యాసిన్ అలీ (29), ప్రేమ్ కుమార్ (48), ప్రసాద్ రాజు (38) అస్వస్థతకు గురయ్యారు.

బడిబాటను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య

మొయినాబాద్‌రూరల్: పాఠశాలల ప్రారంభోత్సవంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఉపాధ్యాయులతో పాటు పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2 నుంచి దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అందులో భాగంగా బడిబాటను విజయవంతం చేయాలన్నారు. ఇందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవియాదవ్, శాంతి యువజన సంఘం మాజీ అధ్యక్షుడు మల్లేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెహర్ ఉన్నీసాబేగం, అంగన్‌వాడీ టీచర్‌కవిత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యతోనే మెరుగైన సమాజం

జెడ్పీ వైస్‌చైర్మన్ గణేశ్

నందిగామ: ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని అప్పుడే మెరుగైన సమాజం అందుబాటులోకి వస్తుందని జెడ్పీ వైస్‌చైర్మన్ ఈట గణేష్ అన్నారు. నందిగామ జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో హెచ్‌ఎం దినేష్ అధ్యక్షతన గురువారం బడిబాట కార్యక్రమంపై అవగహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గణేష్ మాట్లాడుతూ.. బడి మానేసిన పిల్లలను తప్పకుండా పాఠశాలలో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, సర్కారు స్కూళ్లలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, నాణ్యమైన బోధన అందిస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని వివరించారు. చదువుకునే వయస్సులో ఏ ఒక్క బాలుడు పనికి వెళ్లకుండా పాఠశాలలో చేర్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కుమార స్వామి గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, ఎస్‌ఎంసీ రాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్